# ఆర్‌సీబీ టాప్ షో

**ఏడు విజయాలతో అగ్రస్థానంలో బెంగళూరు ● ఢిల్లీ క్యాపిటల్స్‌కు మూడో పరాభవం ● కృనాల్ ఆల్‌రౌండ్ మెరుపులు**

ఢిల్లీ: ఐపీఎల్-18లో ప్రత్యర్థులను వారి సొంతవేదికల్లో చిత్తు చేస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ).. మరో థ్రిల్లింగ్ విక్టరీతో అదరగొట్టింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించిన బెంగళూరు.. ఏడు విజయాలతో పాయింట్ల పట్టికలో 14 పాయింట్లతో అగ్రస్థానాన నిలవడమే గాక ప్లేఆఫ్స్ రేసులో మిగిలిన జట్ల కంటే ముందే బెర్తును ఖరారు చేసుకుంది. క్యాపిటల్స్ నిర్దేశించిన 163 పరుగుల ఛేదనను ఆ జట్టు.. 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కృనాల్ పాండ్యా ఆల్‌రౌండ్ (47 బంతుల్లో 73*, 5 ఫోర్లు, 4 సిక్సులు; 1/28) మెరుపులకు తోడు విరాట్ కోహ్లీ (47 బంతుల్లో 51, 4 ఫోర్లు) మరో అర్ధశతకంతో మెరిశాడు. మొదట బెంగళూరు బౌలర్లు భువనేశ్వర్ (3/33), హాజిల్‌వుడ్ (2/36) కట్టడి చేయడంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ.. నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 162 పరుగుల స్కోరుచేసింది. కేఎల్ రాహుల్ (39 బంతుల్లో 41, 3 ఫోర్లు) నెమ్మదిగా ఆడగా ఆఖర్లో ట్రిస్టన్ స్టబ్స్ (18 బంతుల్లో 34, 5 ఫోర్లు, 1 సిక్స్) బ్యాట్ ఝుళిపించాడు.



కోహ్లీ (51)



కృనాల్ (73*; 1/28)

### నిలిచిన కృనాల్, కోహ్లీ

26/3. మొస్తరు ఛేదనలో 4 ఓవర్లు ముగిసే సరికి బెంగళూరు స్కోరిది. అక్షర్.. ఒకే ఓవర్లో బెతెల్ (12) తో పాటు పడిక్కల్ (0)ను ఔట్ చేయగా మిడ్ వికెట్ వద్ద కరుణ్ మెరుపు త్రో తో రజత్ పటీదార్ (6) రనౌట్ అయ్యాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన కృనాల్.. కోహ్లీతో కలిసి బెంగళూరు ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఢిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో 12 ఓవర్లకూ ఆర్‌సీబీ స్కోరు 78/3గానే ఉంది. ఈ జోడీ సింగిల్స్‌కే పరిమితమైనా స్ట్రైక్ రొటేట్ చేస్తూ నిలకడగా ఆడింది. కానీ ముకేశ్ 13 ఓవర్ నుంచి కృనాల్ గేర్ మార్చాడు. ఆ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన అతడు.. కుల్‌దీప్ ఓవర్లోనూ ఓ సిక్స్ కొట్టాడు. అక్షర్ బౌలింగ్‌లో బౌండరీతో కృనాల్ అర్ధ శతకం పూర్తయింది. కోహ్లీ కూడా వరుసగా మూడో హాఫ్ సెంచరీ (ఈ సీజన్‌లో ఆరోది)ని నమోదుచేశాడు. బెంగళూరు విజయానికి 18 పరుగుల దూరంలో కోహ్లీ నిష్క్రమించినా కృనాల్, డేవిడ్ (19*) లాంఛనాన్ని పూర్తిచేశారు.

### క్యాపిటల్స్ కట్టడి

ఢిల్లీ క్యాపిటల్స్‌కు మెరుపు ఆరంభమే దక్కినా తర్వాత దానిని కొనసాగించలేకపోయింది. అభిషేక్ పొరెల్ (11 బంతుల్లో 28, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడాడు. కానీ మరో ఎండ్‌లో డుప్లెసిస్ (22) మాత్రం స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించలేకపోయాడు. హాజిల్‌వుడ్ నాలుగో ఓవర్లో పొరెల్‌ను ఔట్ చేయగా మరుసటి ఓవర్లో యశ్ దయాల్.. కరుణ్ నాయర్ (4)ను పెవిలియన్‌కు పంపాడు. డుప్లెసిస్‌తో రాహుల్ జతకలిసినా ఈ ద్వయం వేగంగా పరుగులు రాబట్టలేకపోయింది. రాహుల్ అయితే బంతికో పరుగు అన్నట్టుగానే ఆడాడు. కృనాల్.. 10వ ఓవర్లో డుప్లెసిస్ ఇచ్చిన క్యాచ్‌ను కోహ్లీ అందుకోవడంతో అతడి ఇన్నింగ్స్ ముగిసింది. క్రీజులోకి రాగానే ఓ సిక్స్, ఫోర్ కొట్టిన అక్షర్.. హాజిల్‌వుడ్ 14వ ఓవర్లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. భువీ 17వ ఓవర్లో రాహుల్‌తో పాటు అశుతోశ్ శర్మ (2)ను ఔట్ చేసి ఢిల్లీ భారీ స్కోరు ఆశలకు గండికొట్టాడు. కానీ ఆఖర్లో స్టబ్స్.. హాజిల్‌వుడ్ బౌలింగ్‌లో 4, 4తో పాటు దయాల్ 19వ ఓవర్లో ఓ సిక్స్, రెండు బౌండరీలతో ఢిల్లీ పోరాడే స్కోరును సాధించింది.

#### సంక్షిప్త స్కోర్లు

**ఢిల్లీ:** 20 ఓవర్లలో 162/8 (రాహుల్ 41, స్టబ్స్ 34, భువనేశ్వర్ 3/33, హాజిల్‌వుడ్ 2/36); **బెంగళూరు:** 18.3 ఓవర్లలో 165/4 (కృనాల్ 73*, కోహ్లీ 51, అక్షర్ 2/19, చమీర 1/24)

# అమ్మాయిల తొలి విజయం

**శ్రీలంకపై భారత్ గెలుపు**



కొలంబో: ఈ ఏడాది స్వదేశంలో జరగాల్సి ఉన్న మహిళల వన్డే ప్రపంచకప్‌నకు సన్నాహకంగా భావిస్తున్న ముక్కోణపు సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళల జట్టు.. ఆతిథ్య శ్రీలంకపై 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 39 ఓవర్లకే కుదించగా.. భారత స్పిన్నర్లు స్నేహ్ రాణా (3/31), దీప్తి శర్మ (2/22) రాణించి లంకను 38.1 ఓవర్లలో 147 పరుగులకే కట్టడిచేశారు. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నల్లపురెడ్డి శ్రీచరణి (2/26) అరంగేట్ర మ్యాచ్‌లో అదరగొట్టింది. యువ పేసర్ కాశ్వీ గౌతమ్ వికెట్లేమీ తీయకపోయినా కట్టుదిట్టంగా బౌలింగ్ చేసింది. లంక బ్యాటర్లలో హాసిని పెరీరా (30) టాప్ స్కోరర్. ఛేదనలో టాపార్డర్ బ్యాటర్లు ప్రతీక రావల్ (50 నాటౌట్), హర్లీన్ డియోల్ (48 నాటౌట్), స్మృతి మంధాన (43) మెరవడంతో లక్ష్యాన్ని భారత్.. 29.4 ఓవర్లలో పూర్తిచేసింది. ప్రతీకకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఈ సిరీస్‌లో భారత్.. మంగళవారం దక్షిణాఫ్రికాతో తలపడనుంది.



## ఫైనల్‌కు మరో 14 మంది బాక్సర్లు

అమ్మాన్ (జోర్డాన్): ఏషియన్ అండర్-15 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతున్నది. ఈ టోర్నీలో మరో 14 మంది బాక్సర్లు ఫైనల్ చేరారు. ఆదివారం నాటికే 43 మెడల్స్‌ను ఖాయం చేసుకున్న భారత్.. తాజా ఫలితాలతో పతకాల సంఖ్యను మరింత పెంచుకుంది. మహిళల అండర్-15 సెమీస్‌లో కోమల్ (30 కిలోలు), నవ్య (58 కి.), సునైన (61 కి.) రిఫరీ స్టాప్డ్ కాంటెస్ట్‌తో ఫైనల్ చేరారు. వీరితో పాటు ఖుషీ అహ్లావత్ (35 కి.), తృష్ణ మోహిత (67 కి.), మిల్కీ (43 కి.), ప్రిన్సి (52 కి.), స్వి (40 కి.), వంశిక (70 కి.) ఫైనల్ చేరారు. పురుషుల సెమీస్‌లో సంస్కార్ (35 కి.), రుద్రాక్ష్ (46 కి.), అభిజీత్ (61 కి.), లక్ష్య (64 కి.) గెలుపొందారు.

## భారత్ ఓటమి

గ్జియామెన్ (చైనా): ప్రతిష్టాత్మక సుదీర్మన్ కప్ ఫైనల్స్‌లో భారత్‌కు తొలి మ్యాచ్‌లో పరాభవం ఎదురైంది. మొదటి మ్యాచ్‌లో భారత్.. 1-4తో డెన్మార్క్ చేతిలో ఓడింది. ఆదివారం జరిగిన గ్రూప్-డీలో భాగంగా మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో-శృతి మిశ్రా మినహా మిగిలిన నాలుగింటిలోనూ ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్-క్రాస్టో, పురుషుల డబుల్స్‌లో హరిహరన్-రుబన్ కుమార్, మహిళల సింగిల్స్‌లో పీవీ సింధుకు పరాభవం తప్పలేదు.

## గంభీర్‌పై బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఢిల్లీ: భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌ను చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత గంభీర్‌కు జీమెయిల్‌లో 'ఐసిస్ కాశ్మీర్' అనే ఐడీ నుంచి 'ఐ కిల్ యూ' అని బెదిరించిన వ్యక్తిని పోలీసులు గుజరాత్‌కు చెందిన జిగ్నేశ్ సిన్హ్ పర్మార్‌గా గుర్తించారు. 21 ఏండ్ల జిగ్నేశ్.. ఇంజినీరింగ్ చదువుతున్నాడు.

# ముంబై పాంచ్ పటాకా

## వరుసగా ఐదో విజయం

**ఐపీఎల్‌లో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ విజయాల పరంపర కొనసాగుతున్నది. ఆరంభంలో ఆడిన ఐదు మ్యాచ్‌లలో ఒకటే విజయంతో పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో నిలిచిన ముంబై ఇండియన్స్.. తర్వాత ఐదింటిలో ఐదూ గెలిచి 12 పాయింట్లతో ప్లేఆఫ్స్ బెర్త్‌ను దాదాపుగా ఖాయం చేసుకుంది. మొదట రికెల్టన్, సూర్య మెరుపులతో లక్నో సూపర్ జెయింట్స్ ఎదుట భారీ లక్ష్యాన్ని నిలిపిన ముంబై.. ఆ తర్వాత బుమ్రా, బౌల్ట్ పేస్‌తో ప్రత్యర్థిని చిత్తుచేసింది.**

**లక్నో ఓటమి**
**రికెల్టన్, సూర్య అర్ధ శతకాలు**



బుమ్రా (4/22)



విల్ జాక్స్ (29, 2/18)

ముంబై: బ్యాటింగ్ మెరుపులు, బౌలర్ల జోరుతో ఐపీఎల్-18 సీజన్‌లో ముంబై ఇండియన్స్ (ఎంఐ) వరుసగా ఐదో విజయాన్ని నమోదుచేసింది. ఆదివారం వాంఖడే వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 54 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. రికెల్టన్ (32 బంతుల్లో 58, 6 ఫోర్లు, 4 సిక్సర్లు), సూర్యకుమార్ యాదవ్ (28 బంతుల్లో 54, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధ శతకాలతో కదం తొక్కడంతో మొదట బ్యాటింగ్ చేసిన ముంబై.. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 215 పరుగులు చేసింది. భారీ ఛేదనలో లక్నో.. 161 పరుగులకే కుప్పకూలింది. అయుశ్ బదోని (35), మిచెల్ మార్ష్ (34) తప్ప మిగిలినవారంతా విఫలమయ్యారు. ముంబై పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా (4/22), ట్రెంట్ బౌల్ట్ (3/20) లక్నోను దెబ్బతీశారు. బ్యాట్‌తో (29) పాటు బంతి (2/18)తోనూ రాణించిన విల్ జాక్స్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

### ఛేదనలో తడబడి..

భారీ ఛేదనలో లక్నో ఇన్నింగ్స్ ఆరంభం నుంచే తడబాటుకు గురైంది. మూడో ఓవర్లోనే బుమ్రా.. మార్క్‌రమ్ (9)ను ఔట్ చేసి లక్నోను తొలిదెబ్బ కొట్టాడు. వన్ డౌన్‌లో వచ్చిన పూరన్ (27).. చాహర్ బౌలింగ్‌లో హ్యాట్రిక్ సిక్సర్లతో రెచ్చిపోయాడు. కానీ ఏడో ఓవర్లో బౌలింగ్ మార్పుగా వచ్చిన విల్ జాక్స్.. పూరన్‌తో పాటు పంత్ (4)నూ పెవిలియన్‌కు పంపి లక్నోకు డబుల్ షాకిచ్చాడు. బదోని అండగా మార్ష్ లక్నో ఇన్నింగ్స్‌ను నిలబెట్టే యత్నం చేశాడు. హార్దిక్ 9వ ఓవర్లో మార్ష్ రెండు బౌండరీలు రాబట్టగా కర్ణ్ శర్మ బౌలింగ్‌లో బదోని 6, 6, 4 దంచాడు. ఈ జోడీని విడదీయడానికి 12వ ఓవర్లో హార్దిక్.. బౌల్ట్‌కు బంతినిచ్చాడు. ఈ ఓవర్లో బౌల్ట్ రెండో బంతిని పుల్ షాట్ ఆడబోయిన మార్ష్.. తిలక్ వర్మ చేతికి చిక్కడంతో 46 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. 15వ ఓవర్లో మరోసారి బంతినందుకున్న బౌల్ట్.. బదోనిని పెవిలియన్‌కు పంపాడు. ఇక అక్కడ్నుంచి లక్నో పతనం వేగంగా సాగింది. బుమ్రా 16వ ఓవర్లో మిల్లర్ (24), అబ్దుల్ సమద్ (2), అవేశ్‌ను బౌల్డ్ చేయడంతో లక్నో ఓటమి ఖరారైంది.

### రికెల్టన్, సూర్య జోరు

ముంబై ఇన్నింగ్స్‌లో రికెల్టన్, సూర్య ఆటే హైలైట్. ప్రిన్స్ యాదవ్ రెండో ఓవర్లోనే రికెల్టన్.. 6, 4, 4 బాదాడు. ఆరు నెలల విరామం తర్వాత తొలి టీ20 ఆడిన మయాంక్ యాదవ్ వేసిన మూడో ఓవర్లో రోహిత్.. రెండు సిక్సర్లు కొట్టి ఊపుమీదే కనిపించాడు. కానీ అతడే వేసిన స్లో షార్ట్ డెలివరీని ఆడబోయి ప్రిన్స్‌కు క్యాచ్ ఇచ్చాడు. జాక్స్ నెమ్మదిగా ఆడినా రికెల్టన్ జోరు కొనసాగింది. దిగ్వేశ్ ఆరో ఓవర్లో అతడు 6, 4, 6 దంచి 25 బంతుల్లోనే అర్ధ సెంచరీని నమోదుచేశాడు. దిగ్వేశ్ ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన అతడు.. బదోనికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రికెల్టన్ నిష్క్రమించిన కొద్దిసేపటికే ముంబై.. జాక్స్, తిలక్ (6), హార్దిక్ (5) వికెట్లను వెంటవెంటనే కోల్పోయింది. కానీ రికెల్టన్ స్థానంలో వచ్చిన సూర్య మాత్రం లక్నో బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో సిక్సర్‌తో పరుగుల వేట మొదలుపెట్టిన సూర్య.. అతడే వేసిన 13వ ఓవర్లో 6, 4, 4తో శిక్షించాడు. అవేశ్ 18వ ఓవర్లో సిక్సర్‌తో ఈ సీజన్‌లో మూడో అర్ధ శతకాన్ని పూర్తిచేసినా మరుసటి బంతికే నిష్క్రమించాడు. ఆఖర్లో నమన్ (25 నాటౌట్), కార్బిన్ (20) వేగంగా ఆడారు.

#### సంక్షిప్త స్కోర్లు:

**ముంబై:** 20 ఓవర్లలో 215/7 (రికెల్టన్ 58, సూర్య 54, మయాంక్ 2/40, అవేశ్ 2/42); **లక్నో:** 20 ఓవర్లలో 161 ఆలౌట్ (బదోని 35, మార్ష్ 34, బుమ్రా 4/22, బౌల్ట్ 3/20)

#### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 10 | 7 | 3 | 0 | 14 | 0.52 |
| గుజరాత్ | 8 | 6 | 2 | 0 | 12 | 1.10 |
| ముంబై | 10 | 6 | 4 | 0 | 12 | 0.88 |
| ఢిల్లీ | 9 | 6 | 3 | 0 | 12 | 0.48 |
| పంజాబ్ | 9 | 5 | 3 | 1 | 11 | 0.17 |
| లక్నో | 10 | 5 | 5 | 0 | 10 | -0.03 |
| కోల్‌కతా | 9 | 3 | 5 | 1 | 7 | 0.21 |
| హైదరాబాద్ | 9 | 3 | 6 | 0 | 6 | -1.10 |
| రాజస్థాన్ | 9 | 2 | 7 | 0 | 4 | -0.62 |
| చెన్నై | 9 | 2 | 7 | 0 | 4 | -1.30 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

# దర్శకుడిగా శైలేష్ ప్రతిభ చూస్తారు



' 'హిట్ 3' ప్రమోషన్ కంటెంట్ అదిరిపోయింది. దానికి తగ్గట్టే సినిమా కూడా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నా. వంద శాతం సక్సెస్ ఉన్న ప్రొడ్యూసర్ ప్రశాంతి తిపిర్నేని. ఈ సినిమా కూడా హిట్.. నోడౌట్. 'హిట్' ఫ్రాంచైజీలో ఎన్ని సినిమాలైనా చేయొచ్చు. ప్రయత్నిస్తే శైలేష్ చేయగలరు. నాని నా అంచనాలను మించి ఎదిగాడు. ఇంకా ఎదగాలని ఆశిస్తున్నా.' అని అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి అన్నారు. అగ్రహీరో నాని అప్ కమింగ్ సినిమా 'హిట్: ది 3rd కేస్'. శ్రీనిధిశెట్టి కథానాయిక. దర్శకుడు శైలేష్ కొలను 'హిట్' ఫ్రాంచైజీలో ఇది మూడో సినిమా. ప్రశాంతి తిపిర్నేని, నాని కలిసి నిర్మించారు. మే 1న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అతిథిగా వచ్చిన రాజమౌళి పై విధంగా స్పందించారు. హీరో నాని మాట్లాడుతూ – ' ఒక థ్రిల్లర్, ఒక కమర్షియల్ మాస్ సినిమా కలిస్తే ఎలా ఉంటుందో 'హిట్ 3' అలా ఉంటుంది. దర్శకుడిగా శైలేష్ స్టామినా ఏంటో మే 1న చూస్తారు. ఒక అద్భుతమైన థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నామని ప్రామిస్ చేస్తున్నా. షానుజాన్ కెమెరా ఈ సినిమాకు మెయిన్ పిల్లర్. మిక్కీ.జె.మేయర్ తన ఆర్ఆర్‌తో ప్రాణం పోశారు. మృదులగా శ్రీనిధి అద్భుతంగా చేసింది. మే1న సినిమాపై మనకున్న ప్రేమను దేశం మొత్తం వినిపించేలా చేద్దాం.' అని నాని చెప్పారు. ఇంకా రమా రాజమౌళి, విశ్వక్‌సేన్, అడివి శేషు, డైరెక్టర్ రామ్ జగదీష్, డీవోపీ సానుజాన్ వర్గీస్, కోమలి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీరియల్ దెయ్యం తెచ్చిన తంటా



అగ్ర నటి సమంత నిర్మాతగా చేసిన తొలి ప్రయత్నం 'శుభం'. హర్షిత్ మల్గిరెడ్డి, శ్రీయ కొంతం, చరణ్ పెరి, షాలిని కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య పాత్రధారులు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. మే 9న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. హారర్ కామెడీ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందినట్టు ట్రైలర్ చెబుతున్నది. ఊళ్లోని స్త్రీలంతా సీరియల్ చూస్తూ దెయ్యం పట్టినట్టు వింతగా ప్రవర్తిస్తుంటే, వారినుంచి తప్పించుకునేందుకు పురుషులంతా అష్టకష్టాలు పడుతున్నారు. అలాంటి తరుణంలో మాతాజీగా సమంత స్పెషల్ అప్పియరెన్స్ ఇచ్చింది. ట్రైలర్‌లో సడెన్ ఎంట్రీ ఇచ్చేసి సినిమాపై మరింత ఆసక్తిని పెంచేశారు సమంతా. మొత్తంగా ట్రైలర్ నవ్విస్తూ, భయపెడుతూ ఉత్కంఠభరితంగా సాగింది. హాస్యం, హారర్, ఎమోషన్స్.. ఇలా అన్ని అంశాల కలగలుపుగా 'శుభం' రూపొందినట్టు అర్థమవుతున్నది. ఈ చిత్రానికి నేపథ్య సంగీతం: వివేక్ సాగర్, సంగీతం: క్లింటన్ సెరెజో.

# థియేటర్లన్నీ ఇంద్రలోకాలే..



అగ్ర నటుడు చిరంజీవి, అగ్ర నటి శ్రీదేవి జంటగా నటించిన ఎవర్‌గ్రీన్ క్లాసిక్ 'జగదేకవీరుడు– అతిలోక సుందరి'. 1990 మే 9న విడుదలైన ఆ సినిమా పాత రికార్డులన్నింటినీ తిరగరాసి, కొత్త రికార్డు నెలకొల్పింది. టాలీవుడ్ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విజయాన్ని నమోదు చేసింది. ప్రస్తుతం రీరిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్న నేపథ్యంలో.. కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో సి.అశ్వనీదత్ నిర్మించిన ఈ ఎవర్‌గ్రీన్ క్లాసిక్ 35ఏండ్ల తర్వాత మళ్లీ థియేటర్లలో సందడి చేయనుంది. మే 9న సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్టు ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. 2డీతోపాటు త్రీడీలోనూ ఈ సినిమా ప్రేక్షకుల్ని పలకరించనుంది. చిరంజీవి, శ్రీదేవి నటన, కె.రాఘవేంద్రరావు దర్శకత్వ ప్రతిభ, ఇళయరాజా సంగీతం, నిర్మాత అశ్వనీదత్ భారీ నిర్మాణ విలువలు ఈ తరం ప్రేక్షకులను కూడా మెస్మరైజ్ చేయడం ఖాయమని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

**చిత్రం**








# 'కోర్ట్' తర్వాత దొరికిన వరం

''సారంగపాణి జాతకం' టీమ్‌తో పనిచేయడం నా అదృష్టం. ఈ ఛాన్సిచ్చిన ఇంద్రగంటి మోహనకృష్ణగారికి థ్యాంక్స్. టాలీవుడ్‌లో వచ్చిన గొప్ప సినిమాల లిస్ట్‌లో శివలెంక కృష్ణప్రసాద్‌గారి సినిమాలుంటాయి. వాటిలో ఎక్కడో ఒకచోట నాపేరు కూడా ఉంటుందంటే గర్వంగా ఉంది. రూప అందమైన నటి మాత్రమే కాదు, అద్భుతమైన నటి కూడా. అందుకే నేను కూడా ఆమె పక్కన బావున్నా. వెన్నెల కిశోర్, వైవా హర్షలతో మళ్లీ పనిచేయాలనుంది. 'కోర్ట్' తర్వాత నాకెరీర్‌కి 'సారంగపాణి జాతకం' ఓ వరం.' అని హీరో ప్రియదర్శి అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. రూపా కొడవయూర్ కథానాయిక. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకుడు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాత. ఇటీవలే సినిమా విడుదలైంది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సినిమా సక్సెస్‌మీట్‌లో ప్రియదర్శి మాట్లాడారు. ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడుతూ 'శివలెంక కృష్ణప్రసాద్‌గారి సంస్థలో సమ్మోహనం, జెంటిల్‌మెన్ సినిమాలు చేశా. అవి విజయాలు సాధించాయి. ఇప్పుడు 'సారంగపాణి జాతకం' చేశా. హ్యాట్రిక్ పూర్తయింది. పదికాలాల పాటు గుర్తుపెట్టుకునే గొప్ప సినిమాలు మా కాంబినేషన్‌లో రావడం ఆనందంగా ఉంది. ఈ సినిమాకు బ్లాక్‌బస్టర్ టాక్ రావడం ఇంకా ఆనందంగా ఉంది. ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ అందరూ ప్రాణం పెట్టారు. అచ్చమైన తెలుగువాళ్లు నటించిన తెలుగు చిత్రమిది. ఇది నా కెరీర్‌లోనే స్పెషల్ మూవీ.' అని చెప్పారు. ఇష్టపడి, కష్టపడి చేసిన సినిమా ఇదని, మంచి టాక్‌తో దూసుకుపోతున్నదని, ఫ్యామిలీతో ఈ సినిమా చూస్తే వచ్చే కిక్ వేరేలా ఉంటుందని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ అన్నారు. ఇంకా కథానాయిక రూపా కొడవయూర్, వెన్నెల కిశోర్, అవసరాల శ్రీనివాస్, వైవా హర్ష, డీవోపీ పీజీ విందా కూడా మాట్లాడారు.

# ఫ్యాషన్ కాలేజీ నేపథ్యంలో



సుధీస్, అంకిత జంటగా నటిస్తున్న ఎమోషనల్ లవ్ స్టోరీ 'పేషన్'. అరవింద్ జాషువా దర్శకుడు. నరసింహ యేలే, ఉమేష్ చిక్కు, రాజీవ్ సింగ్ నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. క్రియేటివ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. 'పెద్దపెద్ద వాళ్ల పిల్లలు చదివే ఓ ఫ్యాషన్ కాలేజీలో ఓ సామాన్యుడు చదివితే ఎలా ఉంటుందో ఫీలై ఈ కథ రాశా. ఇంటెన్స్ ఎమోషన్స్‌తో కూడిన ప్రేమకథ ఇది. నిర్మాతలు ఎంతో సహకరించారు. డివోపీ నటరాజన్ సినిమాకు మెయిన్ పిల్లర్. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుందీ సినిమా. ఈ జనరేషన్‌కి బాగా కనెక్టయ్యే సినిమా ఇది' అని దర్శకుడు అన్నారు. మరో అతిథి ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ హెన్రీ.

# వైవిధ్యమైన ప్రేమకథ



హరికృష్ణ, భవ్యశ్రీ జంటగా బంధాలు, భావోద్వేగాల నేపథ్యంలో ఓ సినిమా రూపొందుతున్నది. ఆదినారాయణ పినిశెట్టి దర్శకుడు. తిరుపతి శ్రీనివాసరావు నిర్మాత. సినిమా చిత్రీకరణ దశలో ఉంది. రీసెంట్‌గా మూడో షెడ్యూల్ మొదలైంది. దర్శకుడు మాట్లాడుతూ 'ఇది ఓ వైవిధ్యమైన ప్రేమకథ. అన్ని వర్గాలనూ ఆకట్టుకునేలా కథ, కథనాలు ఉంటాయి.' అన్నారు. కొత్త జానర్‌లో సినిమా ఉంటుందని, అందమైన లొకేషన్స్‌లో సన్నివేశాలను చిత్రీకరిస్తున్నామని నిర్మాత చెప్పారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.